క్లుప్తంగా

ఇన్‌స్పెక్టర్‌గా వెంకటేశ్వరరావు



కడియం: పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా అల్లు వెంకటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన కడియం వచ్చారు. 2019లో వెంకటేశ్వరరావు ఇక్కడ ఎస్సైగా బాధ్యతలు నిర్వహించారు. ఇప్పటి వరకూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన బి.తులసీధర్ ఏలూరు వీఆర్‌కు వెళ్లారు.

వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా మురళీకృష్ణ



కంబాలచెరువు: రాజమహేంద్రవరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా నామాల మురళీకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు. మురళీకృష్ణ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

డాక్టర్ బండికి 'ప్రజ్ఞశ్రీ' బిరుదు



రాజమహేంద్రవరం రూరల్: విశాఖపట్నానికి చెందిన ప్రముఖ కవి, నవలా రచయిత డాక్టర్ బండి సత్యనారాయణకు రాజమహేంద్రవరం ఫిలాంత్రోఫిక్ సొసైటీ 'ప్రజ్ఞశ్రీ' బిరుదును ప్రదానం చేయనుంది. ఈ విషయాన్ని ఫిలాంత్రోఫిక్ సొసైటీ వ్యవస్థాపకుడు డాక్టర్ అద్దంకి రాజయోనా శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకూ ఇరవై గ్రంథాలు రాసిన డాక్టర్ బండి సత్యనారాయణ ఇటీవల గౌతమ బుద్ధుని జీవితం ఆధారంగా 'నిర్వాణ' నవల రాశారు. దాన్ని హైదరాబాద్‌కు చెందిన లతా రాజా ఫౌండేషన్ ప్రచురించింది. స్థానిక అంబేడ్కర్ భవనంలో బౌద్ధ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగే సభలో డాక్టర్ బండి సత్యనారాయణకు ఈ బిరుదును ప్రదానం చేయనున్నారు.

బంగారు ముక్కుపుడక సమర్పణ

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట గ్రామంలో కొలువైన పాత పోలేరమ్మతల్లికి శుక్రవారం బంగారు ముక్కుపుడకను సమర్పించారు. గ్రామానికి చెందిన కొయ్యలమూడి తాతబ్బాయి సాయికుమార్ దీనిని అందజేశారు. ఆలయ అర్చకుడు బాపిరాజు చేతుల మీదుగా అమ్మవారికి అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాయనాడ్ బాధితులకు విరాళం

రాజమహేంద్రవరం సిటీ: కేరళలోని వాయనాడ్‌లో జరిగిన ప్రకృతి విధ్వంసంలో సర్వస్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు ఎన్ఎస్‌యూఐ జిల్లా విద్యార్థి విభాగం రూ.1.13 లక్షల విరాళం సేకరించింది. ఈ మొత్తాన్ని రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి పట్టాభి రామయ్య చేతుల మీదుగా ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు విజయవాడలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు.

సిలిండర్ల స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: డొమెస్టిక్ (గృహ) సిలిండర్ల వినియోగంలో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయీస్ అధికారులు శుక్రవారం శాటిలైట్ సిటీ మెయిన్ రోడ్డులో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక ఫుడ్ ప్లాజాలో వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్న ఐదు డొమెస్టిక్ (గృహ) సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఫుడ్ ప్లాజా యజమాని సోముపై 6ఏ కేసు నమోదు చేశారు. తనిఖీలలో విజిలెన్స్ అధికారి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అన్న క్యాంటీన్ ప్రారంభం



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరంలో మూడు అన్న క్యాంటీన్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక సుబ్రహ్మణ్యం మైదానం ఆవరణలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను శుక్రవారం కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాసు, బత్తుల బలరామకృష్ణ, కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ ప్రారంభించారు.

ఏఎస్సై సత్యనారాయణకు అభినందనలు



ఏఎస్సై సత్యనారాయణను అభినందిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

కంబాలచెరువు: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏఎస్సై మాడా సత్యనారాయణకు ఇండియన్ పోలీస్ మెడల్ లభించింది. అమరావతిలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఆయన ఈ మెడల్ అందుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాజమహేంద్రవరం వచ్చిన ఏఎస్సై సత్యనారాయణను ఎస్పీ నరసింహ కిషోర్ అభినందించారు.

కాలువ ఇలా.. నీరందేదెలా..

- నెర్రలు తీస్తున్న పొలాలు
- అన్నదాతల ఆవేదన
- చొరవ చూపని యంత్రాంగం



పిచ్చి మొక్కలతో పూడుకుపోయిన మడికి - ఏడిద కాలువ



కాలువ నీరు రాకపోవడంతో నెర్రలు తీసిన వరిచేను చూపిస్తున్న రైతు

కడియం: కాలువ పక్కనే పొలాలు ఉంటే సాగు చేసే రైతులకు ఎంతో ఆనందపడతారు. నీరు సమృద్ధిగా దొరికి సాగుకు ఇబ్బంది ఉండదని భావిస్తారు. అయితే కాలువ పక్కనే పొలాల్లోకి కూడా నీరు పారకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై కలెక్టర్‌కు 200 మంది రైతుల సంతకాలతో తమ సమస్యను విన్నవించుకున్నప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారు.

ఆరు కిలోమీటర్ల మేర..

ధవళేశ్వరం ఆనకట్ట నుంచి కోటిపల్లి కెనాల్ ద్వారా ఆలమూరు మండలం మడికి నుంచి కడియం మండలం దుళ్ల మీదుగా మండపేట రూరల్ మండలం ఏడిద వరకు సుమారు ఆరు కిలోమీటర్ల మేర సాగునీటి కాలువ ఉంది. ఈ మూడు నియోజకవర్గాల పరిధిలోనూ ఈ కాలువపై ఆధారపడి దాదాపు 1500 ఎకరాలకుపైగా సాగునీరు అందాల్సి ఉంది. అయితే సమయానికి ఈ కాలువ పూడికలు తీయకపోవడంతో ప్రస్తుతం 200 ఎకరాలకు కూడా నీరు అందడం లేదని రైతులు చెబుతున్నారు.

సాగునీరు రాక..

మడికి నుంచి ప్రారంభమైన కాలువ రెండున్న కిలోమీటర్లు వచ్చేసరికి కడియం మండలం పరిధి ప్రారంభమవుతుంది. ఆరు కిలోమీటర్ల పొడవునా సాగునీరు అందించాల్సిన ఈ కాలువ కనీసం రెండు కిలోమీటర్ల వరకు కూడా సాగునీరు రావడం లేదంటే దీని దుస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కొత్తపేట, రాజమహేంద్రవరం రూరల్, మండపేట నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉన్న ఈ సాగునీటి కాలువ పట్ల ఇరిగేషన్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ యేడాది వేసవి సీజన్‌లో పనులు మొదలు పెట్టనట్టేపెట్టి మధ్యలోనే నిలిపివేశారంటున్నారు. దీంతో కడియం మండలం దుళ్ల గ్రామం పరిధిలోని సాగు భూములకు నీరందడం లేదని వారు వివరిస్తున్నారు.

బీటలు తీస్తున్న వరి చేలు

సాగు ప్రారంభంలోనే కాలువ నీరు సక్రమంగా రాకపోవడంతో వరి పొలాలు నెర్రలు తీస్తున్నాయి. ఒక పక్క తీవ్రమైన ఎండలు మండుతున్న నేపథ్యంలో తమ పొలాలకు నీరు ఏ విధంగా అందించాలో అర్థం కాక రైతులు ఆందోళన చెందుతున్నారు. తొలకరి పంట సాగుకే నీరు అందకపోతే పొట్టదశకు వచ్చేసరికి తమ పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదంటున్నారు. ఇప్పటికే ఎకరాకు దాదాపు రూ. 15 వేలకు పైగా పెట్టుబడులు పెట్టామని, నీరు అందకపోతే ఆ మేరకు నష్టపోవడమే కాకుండా పంటకూడా సక్రమంగా చేతికి రాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతుల ప్రయత్నాలు విఫలం

అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో సాగుపై మమకారం వదులుకోలేని రైతులంతా కలిసి స్వయంగా కొంత మేరకు నిధులు పోగు చేసుకుని పూడికతీత పనులు కూడా ప్రారంభించారు. అయితే కాలువ వెంబడి ఉన్న ఆక్రమణలు రైతులు చేపట్టిన పనులకు ఆటంకంగా నిలుస్తున్నాయి. మూడు కిలోమీటర్ల మేర పూడికతీత పనులకు ఆమోదం లభించిందని చెప్పి, పనులు ప్రారంభించారని, కానీ ఆ తరువాత ఏం జరిగిందో ఏమో అర్థంతరంగా ఆపేశారని దుళ్లకు చెందిన పలువురు రైతులు చెబుతున్నారు. పలుమార్లు ఇరిగేషన్ అధికారులను కలిసినప్పటికీ పట్టించుకోవడం లేదంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలుగజేసుకుంటే తప్ప కాలువ పూడికతీత సక్రమంగా జరిగి, పొలాలకు పూర్తిస్థాయిలో నీరు అందదని రైతులు అంటున్నారు.

డ్రైనేజీని తలపిస్తున్న సాగునీటి కాలువ

మడికి నుంచి దుళ్ల మీదుగా ఏడిద వరకు దాదాపు ఆరు కిలోమీటర్లు గోదావరి నీటిని అందించే కాలువ ప్రస్తుతం డ్రైనేజీని తలపిస్తోంది. ఎక్కడికక్కడే పిచ్చిమొక్కలతో నిండిపోయింది. జనావాసాల నుంచి వచ్చే మురుగునీటిని ఈ కాలువలోకి విడుదల చేస్తుండడంతో అత్యంత అధ్వానమైన పరిస్థితిలో ఉంది. కాలువకు ఇరువైపులా ఆక్రమణలకు గురైంది. అనధికార వంతెనలు కూడా నిర్మించారు. దీంతో సాగునీరు సక్రమంగా కాలువ వెంబడి ప్రవహించడం లేదు.

కాలువనీరు రాకపోతే బీడులే..

మడికి కాలువ నీరు సక్రమంగా రాకపోతే కడియం మండలం దుళ్ల, మండపేట రూరల్ మండలం ఏడిద పరిధిలోని దాదాపు వెయ్యి ఎకరాలకుపైగా భూములు బీడులుగా మారతాయని దుళ్ల గ్రామానికి చెందిన రైతు నాయకులు చామకూరి వీరపక్షియ్య తెలిపారు. కాలువలో పూడికతీయకపోతే రైతులు ఇబ్బందులు పడతారని అధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లామన్నారు. పూడికతీత పనులు మొదలు పెట్టి మధ్యలోనే నిలిపివేశారన్నారు. కాలువ నీటిని నమ్ముకుని దుళ్ల గ్రామం పరిధిలో దాదాపు 500 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేస్తున్నారన్నారు. అలాగే ఏడిద పరిధిలో కూడా ఇదే స్థాయి విస్తీర్ణం ఉంటుందని పక్షియ్య వివరించారు. ఇంత మంది రైతులు ఇబ్బంది పడుతున్నా కాలువ పట్ల నిర్లక్ష్యం చేయడం యంత్రాంగానికి తగదని ఆయన అన్నారు. తక్షణం అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

నగరాభివృద్ధికి వంద రోజుల ప్రణాళిక

రాజమహేంద్రవరం సిటీ: రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని నగరాభివృద్ధికి వంద రోజుల ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ కట్టడాలు, ఆక్రమణల తొలగింపు, పెద్ద కాలువల నిర్మాణం, ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు.

18న మానవత కార్యవర్గ ప్రమాణ స్వీకారం

రాజమహేంద్రవరం సిటీ: మానవత సేవాసంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం, సర్వసభ్య సమావేశాలు ఈ నెల 18వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మానవత సేవాసంస్థ కార్యాలయంలో నిర్వహించనున్నారు. మానవత సేవాసంస్థ రీజినల్ చైర్మన్ సీపీ రెడ్డి శుక్రవారం ఈ విషయం తెలిపారు. ప్రస్తుత కార్యవర్గ వీడ్కోలు కార్యక్రమం, గత సంవత్సరంలో జరిగిన కార్యక్రమాల వివరాలను సమావేశంలో చర్చిస్తామన్నారు. సేవాసంస్థకు చెందిన రాజమహేంద్రవరం సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ప్రారంభం

ప్రకాశం నగర్: ఆర్యాపురంలోని శ్రీకృష్ణ చైతన్య మిషన్, శ్రీగౌరాంగ రాధాకృష్ణ మందిరంలో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాధాకృష్ణుల ఊయల ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆశ్రమం ఇన్‌చార్జి శ్రీపాద హరిదాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎన్వీ సత్యనారాయణ, పీవీశ్రీస్ కృష్ణారావు, పలువురు భక్తులు పాల్గొన్నారు.



ధనలక్ష్మిగా ముసలమ్మతల్లి

కడియం: కడియపులంకలోని ముసలమ్మతల్లిని రూ.20 లక్షల విలువైన వివిధ రకాల నోట్లతో అలంకరించారు. శ్రావణ శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా మాదిరిగా ఈ కార్యక్రమం జరిపారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. శనివారం కూడా అమ్మవారి ఇదే అలంకరణలో ఉంటారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సర్దార్ గౌతు లచ్చన్న పోరాటం స్ఫూర్తిదాయకం



గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

సీటీఆర్ఐ: సర్దార్ గౌతు లచ్చన్న చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కొనియాడారు. స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 115వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆయన విగ్రహాలకు నివాళర్పించారు. వై.జంక్షన్ లోని గౌతు లచ్చన్న విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న జాతిని జాగృతి పరిచి సంఘీయుల్లో చైతన్యం తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఉభయ రాష్ట్రాల బీసీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు మార్గాని నాగేశ్వరరావు, బీజేపీ జాతీయ కమిటీ సభ్యుడు సోము వీర్రాజు, టీడీపీ రాష్ట్ర నాయకుడు గన్ని కృష్ణ పాల్గొన్నారు.

వరలక్ష్మీ నమోస్తుతే..



అమ్మవారి దర్శనానికి బారులు దీరిన భక్తులు

- వైభవంగా వరలక్ష్మీవ్రతం
- గోదావరిలో భక్తుల పుణ్య స్నానాలు



వరలక్ష్మి అలంకరణలో బాలాత్రిపుర సుందరి

సీటీఆర్ఐ: శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మి వ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. అలాగే పలు ఆలయాల్లో అమ్మవారిని విశేష పూజలు నిర్వహించారు. నగరంలోని మహాలక్ష్మి ఆలయాలలో కుంకుమ పూజలు, అభిషేకాలు, హోమాలు జరిపారు. దేవీచౌక్‌లోని బాలాత్రిపుర సుందరి దేవి, గోదావరి గట్టున గల శ్రీశృంగేరి జగద్గురు శారదా పీఠం, శంకరమఠంలో అమ్మవారికి, కోటిపల్లి బస్టాండ్ వద్దగల మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో, లాలాచెరువు రోడ్డులోని గోవిందక్షేత్రంలో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. ఉమా మార్కండయేశ్వరస్వామి దేవాలయంలో పార్వతి అమ్మవారికి గాజుల అలంకరణ చేశారు. ఏవీ అప్పారావు రోడ్డులోని అష్టలక్ష్మి దేవాలయం, వంకాయల వారి వీధిలోని శ్రీమహాలక్ష్మి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వరలక్ష్మి అవతారంలో..

ధవళేశ్వరం: అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో కొలువైన బాలాత్రిపుర సుందరీ అమ్మవారిని వరలక్ష్మిగా అలంకరించారు. ఇందులో భాగంగా కరెన్సీ నోట్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



వంకాయల వారి వీధిలో మహాలక్ష్మి అమ్మవారు

దోషులను కఠినంగా శిక్షించాలి



పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు


కంబాలచెరువు: కోల్‌కతాలోని అర్జికార్ వైద్యకళాశాల ఆసుపత్రిలో విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో శుక్రవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.భానుప్రసాద్, జిల్లా సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్, రాజమహేంద్రవరం పట్టణ కార్యదర్శి దినేష్ కుమార్ పాల్గొన్నారు.

ధవళేశ్వరం: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై లైంగిక దాడి, హత్య ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాజమహేంద్రవరం డివిజన్ అధ్యక్షుడు అబ్దుల్ రెహ్మాన్ ఖాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నల్లబ్యాడ్జీలు ధరించి ఫస్ట్ ఎయిడ్ సర్వీసెస్ నిలుపుదల చేస్తూ నిరసన తెలియజేస్తామన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఐఎంఏ నిరసనకు మద్దతుగా తాము శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఫస్ట్ ఎయిడ్ సర్వీసెస్‌లను నిలిపివేస్తున్నామన్నారు.

రైతులను ప్రోత్సహించేందుకు చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీవో) ద్వారా రైతులు, చిన్న రైతులకు ప్రోత్సాహం అందించే చర్యలు చేపట్టాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ మూర్తి అన్నారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో ఎఫ్‌పీవోల ప్రమోషన్ కోసం సహాయాన్ని అందించే ప్రక్రియపై సమన్వయ శాఖల అధికారు లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగం, రైతు ఉత్పత్తిదారుల సంస్థ పురోగతి లక్ష్యంగా ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు, కౌలు రైతు కుటుంబాల వ్యవసాయ ఆదాయాన్ని పెంచడం, మానవ అభివృద్ధి సేవలు, సామాజిక హక్కులను పొందేందుకు వీలు కల్పించడం దీని ముఖ్య ఉద్దేశమన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



రాజమహేంద్రవరం సిటీ: మరమ్మత్తుల నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. = ఉదయం 8 నుంచి 12 గంటల వరకూ కొంతమూరులోని శ్రీరామ్ నగర్, కల్యాణ్ నగర్, ఆదర్శ్ నగర్, ఎంప్లాయీస్ కాలనీ, వీవీ కొండయ్య నగర్, జంగాల కాలనీ, బీసీ కాలనీ, శేషాద్రి లేఅవుట్, ఫోర్త్ బిడ్జి ఏరియా, గాంధీపురం-3, శీలం నూకరాజు కంపెనీ లైన్, శ్యామల నగర్, గోరక్షణ పేట, డైమండ్ పార్క్ ఏరియాలో సరఫరా ఉండదు.

- ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ శాటిలైట్ సిటీ సబ్ స్టేషన్ పరిధిలోని బుచ్చయ్య నగర్, రాక్ చర్చి, శ్రీలక్ష్మీ నగర్, అమరావతి లేఅవుట్, సింగపూర్ సిటీ, మల్లిన నగర్, ఇందిరమ్మ కాలనీ, ఏబీసీడీ బ్లాకులలో విద్యుత్ ఉండదు.
- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఏవీ అప్పారావు రోడ్డు, సాయి టవర్స్, నేతాజీ టవర్స్, బాలాజీ స్ట్రీట్, శారదా నగర్, షీలా నగర్, గోపాలనగర్ పుంత, శ్రీనివాస గార్డెన్స్, అద్దేపల్లికాలనీ పరిసర ప్రాంతాలు, కొంతమూరులోని ఎస్ఎస్ఆర్ లేఅవుట్, సున్నంబట్టి రోడ్డు, రాజరాజేశ్వరి నగర్, నూకాలమ్మ ఆలయ ప్రాంతం, మెయిన్ రోడ్డు, అఫీషియల్ కాలనీ, చందన రమేష్ లేఅవుట్, చెంచు కాలనీ, విడో కాలనీ, తేజా నగర్ ఏరియాలలో అంతరాయం కలుగుతుంది.
- ఉదయం 6 నుంచి 10 గంటల వరకూ పేపర్ మిల్లు క్వార్టర్స్, ఆనంద నగర్, సీసీ కాలనీ, ఇంద్ర నగర్, గాదిరెడ్డి నగర్, వెంకటాపురం, రామదాసుపేట ఏరియాలలో విద్యుత్ ఉండదు.
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పుష్కరఘాట్, గోదావరి బండ్, భీమరాజు వీధి, ఇసుక వీధి, రంగ్రీజు పేట, చంద సత్రం, గుండువారి వీధి, సదనం, వంకాయలవారి వీధి, కోట గుమ్మం డౌన్, ట్రైనింగ్ కాలేజ్, స్టేడియం వెనుక వైపు, చెడిగిపేట, మంగళవారపు పేట, కృష్ణానగర్, కొర్లంపేట, ఆర్యాపురం, తుమ్మలోవ, రామచంద్రరావుపేట, సాంబశివరావు, ఆర్యాపురం ఏరియాల్లో అంతరాయం కలుగుతుంది.
- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ శాస్త్రిగారి స్ట్రీట్, ధనలక్ష్మి స్ట్రీట్, ప్రకాష్ నగర్ రౌండ్ పార్క్, గాంధీపురం 2, 3, లైఫ్ మెడికల్, ముగ్ధ షాపింగ్ మాల్ ఏరియా, శ్యామల నగర్, పంచవటి, జాగృతి బ్లడ్ బ్యాంక్, ప్రకాశం నగర పోలీస్ స్టేషన్ ఏరియా, శ్యామలా నగర్, రామాలయం సెంటర్, స్వరూప్ నగర్, బత్తిన నగర్, ఆల్వాల్ నగర్, ఇండస్ట్రియల్ ఏరియా, సాయి దుర్గానగర్, నారాయణపురం, సైక్లోన్ కాలనీ, గాదిరెడ్డి నగర్ ఏరియాలలో సరఫరా నిలిచిపోతుంది.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడికి నిరసన



ధవళేశ్వరంలో నిర్వహిస్తున్న ర్యాలీ

ధవళేశ్వరం: బంగ్లాదేశ్‌లో మైనార్టీలుగా ఉన్న హిందువులపై ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న దాడులను ఖండిస్తూ శుక్రవారం సాయంత్రం ధవళేశ్వరం హిందూధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక బ్యారేజ్ సెంటర్ నుంచి పప్పువారిగేటు వరకూ ఈ కార్యక్రమం సాగింది. వేగిశెట్టి కోదండరామారావు, గద్దే ప్రసాద్, రాకా రమణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి నివాళి



వాజ్‌పేయి విగ్రహానికి పూలమాల వేస్తున్న బీజేపీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయమని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నెం శ్రీనివాస్ అన్నారు. వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా శుక్రవారం శాటిలైట్‌సిటీలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

'జాంపేట' ఎన్నికలకు పూర్తయిన నామినేషన్లు



నామినేషన్లను స్వీకరిస్తున్న ఎన్నికల అధికారి జగన్నాథరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: ది జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ పాలక మండలి ఎన్నికలకు రంగం సిద్ధమైంది. రాజమహేంద్రవరం కేంద్రంగా ఏడు పాఠశాలలోని 25 పోలింగ్ కేంద్రాలలో ఈ నెల 25న ఎన్నికలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన నామినేషన్ ప్రక్రియ శుక్రవారం పూర్తయ్యింది. ఈ ఎన్నికలను మూడు నియోజక వర్గాలుగా విభజించారు. రాష్ట్రంలో 10 బ్రాంచ్‌లతో కొనసాగుతున్న ఈ బ్యాంక్‌లో 27,724 మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోనున్నారు. ఈ మూడు నియోజకవర్గాల పరిధిలో 12 మంది డైరెక్టర్ల ఎంపిక కోసం ఎన్నికలు నిర్వహించనున్నారు. 37 మంది అభ్యర్థులు నామినేషన్లు సమర్పించినట్టు ఎన్నికల అధికారి ఎం.జగన్నాథరెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం నామినేషన్ల పరిశీలన, ఆదివారం ఉపసంహరణ, 25వ తేదీన ఎన్నికలు, 26వ తేదీన రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ పాఠశాలలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితం నాశనం



సదస్సులో మాట్లాడుతున్న సెబ్ ఇన్‌స్పెక్టర్ నిక్సన్

రాజమహేంద్రవరం రూరల్: ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితం నాశనమవుతుందని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.నిక్సన్ అన్నారు. కాతేరులోని వ్యవసాయ కళాశాలలో గురువారం యాంటీ ర్యాగింగ్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నిక్సన్ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ర్యాగింగ్ పేరుతో ఎదుటి వారిని ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ర్యాగింగ్ చేయడం నేరమనే విషయాన్ని ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు.